## డిప్యూటీ సిఇఒకు సన్మానం



ప్రజాపక్షం/నాంపల్లి: తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టిజిఇజెఎసి సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు పంచాయతీ రాజ్ శాఖలో డిప్యూటీ సీఈఓగా పదోన్నది పొందిన సందర్భంగా టిజిఒ హైదరాబాద్ జిల్లా సంఘం నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు అధ్యక్షుడు ఎంబి కృష్ణయాదవ్, తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.లక్ష్మ ణ్ గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. కార్యక్రమంలో టిజిఒ ప్రధాన కార్యదర్శి బి.శ్యామ్, సహ అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు డా.రామారావు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రింటర్స్‌డే వేడుకలు

ప్రజాపక్షం/కంటోన్మెంట్: ప్రింటర్స్ డే వేడుకలు కలాసీగూడలో ఘనంగా నిర్వహించారు. ప్రింటింగ్ మెషిన్ ఆవిష్కర్త జోహన్నస్ గూటన్బర్గ్ జయంతి(ప్రింటర్స్ డే )సందర్భంగా మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలాసిగూడలోని కమ్యూనిటీ హాల్లో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మహంకాళీ పోలీస్‌స్టేషన్ సీఐ రవికుమార్ మాట్లాడుతూ... ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మక్తాల జలంధర్ గౌడ్, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మక్తాల శేఖర్ గౌడ్, సభ్యులు జెవి సూర్యప్రకాష్, హరికుమార్, శివ కుమార్, డి.ప్రకాష్, పూర్ణ చందర్, బి.ఆంజనేయులు, నర్సింహ చారి, వేణుగోపాల్, రాజు, శ్రవణ్ కుమార్, సుబ్రహ్మణ్యం, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అరైవ్–అలైవ్ క్యాంపెయిన్ స్కూల్ సిబ్బందికి అవగాహన



ప్రజాపక్షం/బంజారాహిల్స్: ట్రాఫిక్ పట్ల అవగాహన, చైతన్యం కలిగించడంలో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం 2వ దశ సందర్భంగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్, భారతీయ విద్యా భవన్ స్కూల్ బస్సు, వాన్ డ్రైవర్స్, హెల్పర్లకు ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథి డిసిపి(ట్రాఫిక్2) కాజల్ సింగ్, అదనపు డిసిపి(ట్రాఫిక్2)సి.వేణుగోపాల్‌రెడ్డి,జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఎసిపిహరిప్రసాద్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ సీఐ ఎన్.రవీందర్, బేగంపేట్ టిటిఐ ఇన్స్పెక్టర్ నాగుల అశోక్, బంజారాహిల్స్ ట్రాఫిక్ సిఐ సునీల్ తదితరులు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.

## పనులు సకాలంలో పూర్తి చేయాలి

చార్మినార్ జెడ్‌సీ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/యాకుత్‌పురా: రోడ్డు విస్తరణ, అభివృద్ధి ప్రాజెక్ట్ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.ఈ మేరకు ఆయన మంగళవారం ఉదయం యాకుత్ పురా సర్కిల్ పరిధిలోని డబీర్ పురా, షేక్ ఫయాజ్ కమాన్, బీబీ కా అలావా, బడాబజార్, నాగాబౌలి, యాకుత్‌పురా, తలబ్ కట్టా ప్రాంతాల్లో ప్రాజెక్ట్స్, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. పనుల పురోగతిపై అధికారులతో కలిసి ఆరా తీశారు.

## ఆటో టిప్పర్ల పనితీరు మెరుగుపడాలి



ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట: పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి స్వచ్ఛ ఆటో టిప్పర్ల పనితీరును మెరుగుపరచాలని చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చాంద్రాయణ గుట్ట నర్కి పూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయం లో మంగళవారం ఆయన మలక్‌పేట్, ముసారంబాగ్ సర్కిళ్ల పారిశుధ్య విభాగం నిర్వహణ, పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మలక్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఇంకేషఫ్ అలీ, ఎస్‌డబ్ల్యూఎం డీఈ నవీన్ కుమార్, ఏఈ శరత్, సానిటరీ సూపర్వైజర్లు, జవాన్‌లు, ఎస్ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## రేవంత్‌కు బాక్సింగ్‌లో ప్రథమ స్థానం



ప్రజాపక్షం/సికింద్రాబాద్: సిఎం కప్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఎల్ బి స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలో సీతాఫలమండి డివిజన్ ప్రాంతంలోని బీదలబస్తీకి చెందిన రేవంత్ పాల్గొని 65 కేజీ విభాగంలో మొదటి స్థానాన్ని సాధించాడు. మొదటి స్థానం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ఎన్నికలు ఎప్పుడయినా బిజెపిదే విజయం

కేంద్రమంత్రి బండి సంజయ్



ప్రజాపక్షం/చార్మినార్: భాగ్యనగర్‌లో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిజేపినే విజయం సాధిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి,కరీంనగర్ ఎంపి బండి సంజయ్ స్పష్టం చేశారు. చార్మినార్ భాగ్యలక్ష్మి దేవి ఆలయాన్ని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాది అభివృద్ధి నినాదమన్నారు. చార్మినార్ భాగ్యలక్ష్మి దేవి అమ్మవారి ఆశీస్సులతో కరీంనగర్ గడ్డమీద కాషాయ జెండా ఎగరవేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకు మూటలు మోస్తున్నారని ఆరోపించారు. అమ్మాయిలకు డ్రగ్స్ ఇచ్చి మత మార్పిడి చేస్తున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎంఐఎం పార్టీ మెడలు వంచి కరీంనగర్‌లో విజయం సాధించామన్నారు.

# విద్యార్థులను నైపుణ్యతలో ప్రపంచ స్థాయికి తీసుకువెళ్తాం

రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



ప్రజాపక్షం/కొత్తూరు: తెలంగాణ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శిక్షణలు ఇచ్చేందుకు కేంద్రాలను సైతం ఏర్పాటు చేశామని తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వివరించారు. మంగళవారం నందిగామ మండలం కన్హాశాంతి వనంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఇండియా స్కిల్ రిజనల్ కాంపిటిషన్ 2025..2026 ముగింపు వేడుకలకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కాంపిటిషన్‌లో సౌత్ ఇండియాలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళతోపాటు రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు పుదుచ్చేరి, లక్షద్వీప్‌లకు చెందిన సుమారు 300మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాంపిటిషన్‌లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్‌తోపాటు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. గెలుపొందిన విద్యార్థులకు అంతర్జాతీయ కాంపిటిషన్లకు పంపించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ యువత విద్యతో పాటు స్కిల్ పై అవగాహన పెంచుకోవాలని, అప్పుడు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. యూనియన్ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో మంచి కాంపిటిషన్ ఏర్పాటు చేశారని వివరించారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో యువతకు నైపుణ్యంపై శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళెందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 120అడ్వాన్స్ స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ల ద్వారా నూతనంగా ఏర్పాటు చేయనున్న పరిశ్రమలకు నైపుణ్యం కలిగిన యువత సిద్దంగా ఉంటుందని పేర్కొన్నారు. శాస్త్ర సాంకేతిక పరంగా అన్ని రంగాల్లో యువత రాణించేందుకు శిక్షణ ప్రభుత్వం ఇస్తుందని, యువకులు ఆసక్తిగా నేర్చుకుంటేనే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి రాణించేందు కు అవకాశం ఉంటుందని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పై శిక్షణ ఇస్తే స్వయం ఉపాధి రంగాలు సైతం అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అదిరోహించేందుకు అస్కారం ఉంటుందని పేర్కొన్నారు.

## మెర్జర్ మూమెంట్ విజేతలకు బహుమతులు



ప్రజాపక్షం/కంటోన్మెంట్: కంటోన్మెంట్ మెర్జర్ మూమెంట్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ బహుమతులను ప్రదానం చేశారు. కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధిని కాంక్షిస్తూ, కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్లో విలీనం చేయాలనే డిమాండ్కు మద్దతుగా బోయిన్పల్లి యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బస్తీ బాట



ప్రజాపక్షం/సిటీబ్యూరో: వినియోగదారుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా జలమండలి చేపట్టిన బస్తీ బాట కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగానే మంగళవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి గోల్కొండ జోన్ పరిధిలోని నానల్‌నగర్ చౌరస్తా వద్ద సీవరేజ్ మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ ప్రాంతంలోని హోటళ్లు, వాణిజ్య సముదాయాలు ఘనపదార్థాలు సీవరేజ్ లైన్లలో వదలడంతో మ్యాన్ హోళ్ళు తరచూ పొంగడం జరుగుతోందని.. దీంతో ట్రాఫిక్ ఆటంకం ఏర్పడుతుందని స్థానికులు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ పనులు చేపట్టినా.. శాశ్వత పరిష్కారం ఖచ్చితంగా గుర్తించలేకపోయారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టేలా.. ఫుట్‌పాత్ అనుకుని ఉన్న మాన్ హోళ్లలోకి అక్కడక్కడ చెట్ల వేర్లు చేరి సమస్య పెంచిందని గుర్తించారు. దీంతో తాత్కలిక చర్యగా చెట్ల వేర్లను తొలగించి ధ్వంసమైన మ్యాన్ హోళ్ళను పునర్నిర్మాణం చేయాలని సూచించారు. అలాగే శాశ్వత పరిష్కరానికి ఈ ప్రాంతాల్లోని సీవరేజ్ లైన్లను సమీపంలోని జోన్3 ట్రంక్ మెయిన్ కు మళ్ళించేందుకు.. ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేస్తూ సీవరేజ్ నెట్‌వర్క్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, సమీపంలోని హోటళ్లకు సిల్ట్ ఛాంబర్ నిర్మాణానికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. అనంతరం లంగర్ హౌజ్, అంబేద్కర్‌నగర్‌లో తాగునీటి సరఫరాపై స్థానికులతో మాట్లాడిన ఎండీ.. ప్రశాంత్‌నగర్‌లో కలుషిత నీటి ఫిర్యాదు పరిష్కార పనులను అధికారులతో సమీక్షించారు.

# ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం

రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తావా.. గద్దె దిగుతావా, సిఎం తేల్చుకోవాలి

అఖిలపక్ష పార్టీలు, విద్యార్థి, మేధావుల సమావేశంలో పలువురు వక్తలు



ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముచ్చటగా మూడవసారి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న, గత ఐదు సంవత్సరాలుగా ఉన్న రూ. 7 వేల కోట్ల ఫీజుల బకాయిలు మాత్రం విడుదల చేయకుండా, పేద విద్యార్థుల ఉసురు తీసుకుంటుందని అఖిలపక్ష పార్టీల నేతలు, విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకపడ్డారు. ఫీజుల బకాయిలు విడుదల చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 'కాలేజీ విద్యార్థుల కన్నీటి చదువులు' అనే అంశంపై అఖిలపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు, మేధావులు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంఘాల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ అధ్యక్షత వహించగా, జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ సమన్వయం చేశారు. ఈ సమావేశంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఎంఎల్‌సి ఎల్. రమణ, జూలూరి గౌరీ శంకర్, తెలంగాణ విఠల్, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యపై పెట్టిన పెట్టుబడిని, పెట్టుబడి కోణంలో చూడకుండా మానవ వనరుల అభివృద్ధిగా చూడాలన్నారు. ముఖ్యంగా బడుగుల విద్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదని, తక్షణమే పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజుల బకాయిలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

**యజమాన్యాల సమస్య కాదు, లక్షల మంది విద్యార్థుల బాధ..**

రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల రియింబర్స్‌మెంట్ సమస్యను ప్రైవేట్ కళాశాల యజమాన్యాల సమస్యగా చూస్తుందని, ఈ సమస్య రాష్ట్రంలో ఉన్నత విద్యను చదువుకుంటున్న లక్షల మంది విద్యార్థుల బాధగా చూడాలని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని మార్లు విన్నవించిన ప్రభుత్వం బండరాయిలా మారిందని, కనీస స్పందన లేదని విమర్శించారు. మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఎల్ రమణలు మాట్లాడుతూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి లెక్క లేదని, అసెంబ్లీలో, బయట ఫీజుల రియింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని పోరాటం చేస్తుంటే, ప్రభుత్వం నయా పైసా కూడా విడుదల చేయకుండా, పేద విద్యార్థుల ఉసురు తీసుకుంటుందని వారు తీవ్రంగా విమర్శించారు. ఈ సమావేశంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు హేమ సబీసీతో పాటు కనకాల శ్యాం కుర్మ, శేఖర్ సాగర, మని మంజరి పాల్గొన్నారు.

## యువ ఆపద మిత్రులకు హైడ్రా అవకాశాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రకృతి వైపరీత్యాల సమయంలో యువ ఆపద మి త్రుల సేవలను వినియోగించుకుంటామని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ తెలిపారు. హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫో ర్స్‌లో నియామకాల సమయంలో కూ డా వీరికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పా రు. 'యువ ఆపద మిత్ర' పథకం కింద రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన 105 మంది వాలంటీర్లు ఫతుల్లాగూడలో వారం రోజుల పాటు శిక్షణ పొ ందారు. ఆపద సమయంలో ప్రజలను ఎలా రక్షించాలి, వివిధ శాఖలతో కలిసి ఎలా పని చేయాలి అనే అంశాల్లో వారికి శిక్షణ ఇచ్చారు. పర్యావరణ హిత నగర నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, చె రువులు, నాలాల పరిరక్షణలో హైడ్రా చర్యలు తీసుకుంటోందని కమిషనర్ తె లి పారు. శిక్షణ జీవితాంతం ఉపయోగపడేలా నేర్చుకున్న విషయాలను సమా జ సేవలో వినియోగించాలని సూచించారు. హైడ్రా అదనపు కమిషనర్ ఆర్. సు దర్శన్, అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, ఆర్ఎఫ్ఓ జయప్రకాశ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆదివాసి, వెనుకబడిన వర్గాల ఆర్థిక వికాసమే లక్ష్యం: మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆదివాసి అత్యంత వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా స్వయం సమృద్ధి దిశగా నడిపించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని ఆగాఖాన్ ఫౌండేషన్ వేదికగా జరిగిన 'సమగ్ర జీవనోపాధి కార్యక్రమానికి' ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యా రు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆగాఖాన్ ఫౌండేషన్, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ 'బ్రాక్' సంయుక్త సహకారంతో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా మరో 8,000 కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందించనున్నట్లు ప్రకటించారు. పేదరిక నిర్మూలనలో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్న ఆగాఖాన్ ఫౌండేషన్, బ్రాక్ సంస్థల కృషిని మంత్రి అభినందించారు. ఈ పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆమె పిలుపునిచ్చారు.

## రియర్ విండో తనిఖీ నిర్వహించిన జిఎం



ప్రజాపక్షం/హైదరాబాద్:కాచిగూడ సీతాఫల్ మండి, చర్లపల్లి యాదాద్రి సెక్షన్ల మధ్య రియర్ విండో తనిఖీని దక్షిణ మధ్య రైల్వే జనరల్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ బుధవారం నిర్వహించారు. తనిఖీ సమయంలో ఆయనతో పాటు హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ, ఇతర సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ తనిఖీ లో ప్లాట్‌ఫామ్ నెం.1 పై ప్రయాణికుల సౌకర్యాలను, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, యార్డ్ మరియు పిట్ లైన్ కార్యకలాపాలను ఆయన పరిశీలించారు. ఆయన అధికారులతో మాట్లాడుతూ రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా అనుసరించాలని ఆదేశించారు. జనరల్ మేనేజర్ గోల్నాక వైపు ఉన్న స్టేషన్ ఆవరణను కూడా తనిఖీ చేస్తూ అక్కడ స్టేషన్ అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించారు. తరువాత, సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సీతాఫల్ మండి – లాలాగూడ యాదాద్రి సెక్షన్లో రియర్ విండో తనిఖీని సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ గోపాలకృష్ణన్, ఇతర సీనియర్ రైల్వే అధికారులతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా సీతాఫల్‌మండి–లాలాగూడ కార్డ్ లైన్ సెక్షన్‌లో పురోగతిలోనున్న పనులను ఆయన పరిశీలించారు . చర్లపల్లియాదాద్రి మధ్య నిర్వహించిన రియర్ విండో తనిఖీలో సిగ్నలింగ్ వ్యవస్థ, ట్రాక్, గ్రేడియన్లు, వంతెనలు మొదలైన వాటిని పరిశీలిస్తూ సెక్షన్ భద్రతను పెంపొందించడానికి చేపట్టిన సమగ్ర చర్యలపై దృష్టి సారించారు. జనరల్ మేనేజర్ యాదాద్రి రైల్వే స్టేషన్‌లో రూ.24.45 కోట్లతో చేపట్టిన పునరాభివృద్ధి పనులను పరిశీలించారు. రాబోయే స్టేషన్ పునరాభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. లక్ష్యం ప్రకారం ప్రాజెక్టును పూర్తి చేయడానికి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

# జైలు సిబ్బందికి ప్రత్యేక సాలరీ ప్యాకేజీ మేళా

1,332 మందికి పోలీస్ సాలరీ ప్యాకేజీ ప్రయోజనాలు

జైళ్ల శాఖ డిజి డా. సౌమ్య మిశ్రా



ప్రజాపక్షం/హైదరాబాద్:తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జైలు సిబ్బందికి మెరుగైన బ్యాంకింగ్, ఆర్థిక భద్రతా సదుపాయాలు అందించేందుకు ప్రత్యేక సాలరీ ప్యాకేజీ మేళాను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శాఖ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా ముఖ్య అతిథిగా హాజరై సిబ్బందికి అందిస్తున్న ఆర్థిక భద్రతా చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జైలు సిబ్బంది అత్యంత సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో భద్రత, క్రమశిక్షణ, ఖైదీల పునరావాసం వంటి కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి సిబ్బందికి పద్ధతిసంబంధిత బ్యాంకింగ్ సదుపాయాలు, ఆర్థిక రక్షణ కల్పించడం శాఖ బాధ్యతగా భావిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1,332 మంది జైలు సిబ్బందికి పోలీస్ సాలరీ ప్యాకేజీ ప్రయోజనాలు వర్తింపజేస్తున్నారు. ప్రమాద బీమా, జీవ బీమా, ఎయిర్ యాక్సిడెంట్ బీమా, జీతంపై ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం, వ్యక్తిగత రుణాలు, కుమార్తె వివాహం లేదా పిల్లల విద్య కోసం ప్రత్యేక రుణాలు (ప్రీక్లోజింగ్, ప్రాసెసింగ్ ఛార్జీలు మినహాయింపు), ఆరోగ్య పరీక్షలు, వైద్య సదుపాయాలు, జిమ్,ఫిట్నెస్, లౌంజ్ యాక్సెస్, స్పా, ఓటిటి వంటి జీవనశైలి సదుపాయాలు, లాకర్ రాయితీలు ఇందులో ఉన్నాయి.ప్రతి భాగస్వామ్య బ్యాంకుకు ప్రత్యేక లియాజన్ అధికారులను నియమించి, ఖాతా సేవలు, అవసరమైన పత్రాలు, ప్రయోజనాలపై సిబ్బందికి పూర్తి స్థాయి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న అన్ని ప్రయోజనాలను తెలుసుకుని కుటుంబాల ఆర్థిక భద్రత దృష్ట్యా సరైన నిర్ణయాలు తీసుకోవాలని డిజి సూచించారు. ఈ కార్యక్రమంలో శాఖ సిబ్బంది సంక్షేమం, ఆర్థిక సాధికారత, వృత్తిపరమైన భద్రత పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని ఆమె అన్నారు. ఇక కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్)లో భాగంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్లు వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న ఖైదీల సౌకర్యార్థం బ్యాటరీ ఆధారిత వాహనాలను కారాగార శాఖకు అందజేశాయి. కార్యక్రమంలో వీటిని అధికారికంగా అప్పగించారు. అర్హులైన ఉద్యోగులందరికీ ప్రయోజనాలు అందేలా ప్రక్రియ ప్రారంభించారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజి ఎన్. మురళీ బాబు, డిఐజిలు డా. డి. శ్రీనివాస్, ఎం. సంపత్, సూపరింటెండెంట్లు ఎన్. శివకుమార్ గౌడ్, జి. ప్రమోద్, ఎస్. శ్రీనివాస రెడ్డి, కె. శ్రీమన్ రెడ్డి పాల్గొన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

ప్రజాపక్షం/సిటీ బ్యూరో:రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. కలక్టరేట్ సమావేశం మందిరంలో మంగళవారం జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు, బ్లాక్‌స్పాట్ల పరిశీలన, స్టాఫ్ లైన్ మార్కింగ్, స్పాట్‌లైన్ మార్కింగ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సైన్ బోర్డులు, పాదచారుల భద్రతలపై నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు. రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్సను అందించే విషయమై ఆసుపత్రుల వైద్యులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ దరించాలని చెప్పారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై అధికారులతో ఆమె చర్చించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయేల్ డేవిస్, రవాణశాఖ జాయింట్ కమిషనర్ రమేష్, డిఆర్ఓ వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన 5వ మూట్ ట్రిబ్యునల్ పోటీలు




ప్రజాపక్షం/హైదరాబాద్: యువ ఛార్టర్డ్ అకౌంటెంట్ లు, న్యాయ న్యాయవాదులో వృత్తి నైపుణ్యాలను పెంపోందించడమే లక్ష్యంగా తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ మూట్ ట్రిబ్యునల్ పోటీలు మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా ముగిశాయి.

# కోఠి కాల్పుల కేసులో ఇద్దరు అరెస్ట్



ప్రజాపక్షం/హైదరాబాద్: కోఠి ఎస్‌బిఐ ఎటిఎం వద్ద తుపాకీతో కాల్పులు జరిపి రూ. 6 లక్షల నగదు దోచుకున్న అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ టాస్క్ ఫోర్స్, సుల్తాన్ బజార్ పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను హైదరాబాద్ సిటీ టాస్క్ ఫోర్స్ డిసిపి గైక్వాడ వైభవ్ రఘునాథ్, ఖైరతాబాద్ జోన్ డిసిపి కె. శిల్పవల్లిలు బుధవారం వెల్లడించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఫుర్కాన్ అహ్మద్ (36), హైదరాబాద్‌లో నివసిస్తున్న మహమ్మద్ తయబ్ త్యాగి (30) ఉన్నారు. వీరి నుంచి ఒక నాటు తుపాకీ ,35 తూటాలు, 2 మ్యాగజైన్లు, రూ. 2,38,000 నగదు, 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో ఐదుగురు నిందితులు ఫహీమ్ అహ్మద్, నౌషాద్, ఆబిద్, దానిష్ త్యాగి, మహమ్మద్ మత్లూబ్ పరారీలో ఉన్నారు. నిందితుడు తయబ్ త్యాగి నగరంలో ఓలా,ఉబర్ డ్రైవర్‌గా పనిచేస్తూ, కోఠి, అబిడ్స్ ప్రాంతాల్లో తెల్లవారుజామున నగదు డిపాజిట్ చేసే వారిని గమనించి దోపిడీకి పథకం వేశాడు. ఇందుకోసం ఉత్తరప్రదేశ్ నుండి తన బంధువులను, నేర చరిత్ర కలిగిన ముఠాను పిలిపించాడు. జనవరి 31న బాధితుడిపై కాల్పులు జరిపి నగదు సంచులతో పరారయ్యారని డిసిపి తెలిపారు.

# అక్షర చిట్‌ఫండ్స్ ఆస్తులు బాధితులకు పంచాలి

**చిట్‌ఫండ్ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, పటిష్ట వ్యవస్థ ఉండాలి: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్**



**ప్రజాపక్షం/ముషీరాబాద్ :** చిట్‌ఫండ్ వ్యవస్థను పర్యవేక్షించే ఒక ప్రభుత్వ యంత్రాంగంతో పాటు పటిష్ట వ్యవస్థ ఉండాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. కేవలం అరెస్టులతో సరిపెట్టుకుండా చిట్‌ఫండ్స్ యాజమాన్యం ఆస్తులను జప్తు చేసి బాధితులకు పంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్షర చిట్‌ఫండ్స్ బాధితులు మంగళవారం ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాకు కూనంనేని సాంబశివరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కష్టపడి సంపాదించుకున్న సొమ్మును ఎవరో దోచేస్తే బాధగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. నమ్మిన వాళ్ళను మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ వ్యవహారాన్ని ప్రస్తావనకు తీసుకువస్తానని ఆయన హామీ ఇచ్చారు. చిట్‌ఫండ్స్ రియల్ ఎస్టేట్ సంస్థల పనితీరుపై నిఘా ఉండేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి ఆర్థిక దోపిడీలను అరికట్టేలా ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరారు. బాధితులకు న్యాయం జరిగేంతవరకు సిపిఐ బాధితుల పక్షాన నిలుస్తుందని కూనంనేని హామీ ఇచ్చారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, అక్షర చిట్‌ఫండ్స్ బాధితుల సంఘం గౌరవాధ్యక్షురాలు పశ్యపద్మ మాట్లాడుతూ అక్షర చిట్‌ఫండ్స్ మోసాలపై తాము ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చామన్నారు. ఈ మోసాల కారణంగా 5000 కు పైగా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు న్యాయం చేయుటకు సంస్థకు చెందిన చరాస్థి, అచరాస్థులను తక్షణం అటాచ్ చేయాలన్నారు. సంస్థ బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయాలని, యాజమాన్యాన్ని అరెస్టు చేయడంతో పాటు చిట్ రిజిస్ట్రార్ ఆదేశాల ప్రకారం అఫిడవిటర్లు, మార్టిగేజ్ ఆస్తులను కఠినంగా హోల్డ్‌లో ఉంచేలా చూడాలని కోరారు. ఇప్పటికే విడుదలైన వాటిపై విచారణ జరిపించాలని, ఎఫ్‌డీఆర్‌లను రిలీజ్ చేసిన అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, కేవలం చీటింగ్ కోణంలోనే కాకుండా కంపెనీస్ చట్టం, ఆదాయపు పన్ను చట్ట ఉల్లంఘనల కోణంలో కూడా సమగ్ర దర్యాప్తు చేయుటకు సంబంధిత విభాగాలకు ఆదేశాలు ఇవ్వవలసిందిగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. బాధితులు జిల్లా స్థాయిలో కమిటీలుగా ఏర్పడి కలెక్టరేట్ల వద్ద రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ధర్నాలు నిర్వహించి కలెక్టర్లకు వినతి పత్రాలను ఇవ్వాలని ఆమె కోరారు. నేరగాళ్ళపై పోలీసులు చార్జ్‌షీట్ వేసేలా తాము చర్యలు తీసుకున్నామన్నారు. ధర్నాలో చిట్‌ఫండ్స్ బాధితుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కాలేరు మొగిలయ్య, ప్రధాన కార్యదర్శి వజ్రాల అరుణ, ఇతర నాయకులు జగన్‌మోహన్, పూర్ణిమాచారి, కొండారెడ్డి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/షాబాద్:** మన్మరి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని సర్పంచ్ లాలాపేట బందయ్య అన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని మన్మరి గ్రామంలో మంచినీటి బోర్లను మర్మత్తులు చేసి త్రాగునీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రాచీన వైద్యంతో ఆరోగ్యం



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** ప్రాచీన వైద్యంతో మెరుగైన వైద్యం అందుతుందని బిజెపి నాయకులు బచ్చి గళ్ళ రమేష్, తుర్కయంజాల్ బిజెపి అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి అన్నారు. బుధవారం ఆదిబట్ల సర్కిల్ తుర్కయంజాల్ పరిధి మునగనూర్ టెలిఫోన్ కాలనీ అధ్యక్షురాలు సౌజన్య భారతి ఆధ్వర్యంలో మర్మక్షేత్ర శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సశీంద్రన్ గురుకల్,అర్జున్, జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డి, కాలనీ ఉపాధ్యక్షులు శివ, కృష్ణవేణి, పాండురంగారెడ్డి, ఎగ్జిక్యూటివ్ నెంబర్ విమల్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బలహీనవర్గాలపై దాడులు.. రాజకీయాలు మానుకోవాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బలహీన వర్గాలపై దాడులు చేయడం..అహంకార రాజకీయాలను మానుకునేందుకు అగ్రవర్ణాల కృషి చేయాలని బీసి జనసేన జాతీయ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప డిమాండ్ చేశారు. మంగళవారం బీసి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ఆర్.కృష్ణయ్యతో కలిసి ఛలో నాగర్ కర్నూల్‌కు తరలివెళ్ళారు. ఆర్.కృష్ణయ్యతో కలిసి రాస్తారోకో నిర్వహించి ఆందోళనలు చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షురాలు జక్కుల జలజ, అధికార ప్రతినిధి స్రవంతి రాజ్‌లు పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతు చేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం అంబేద్కరు విగ్రహం నుండి నందివనపర్తికి వెళ్ళె ప్రధాన రహదారిని మరమ్మతు చేయాలని కోరుతూ మంగళవారం కాలనీవాసులు ఎంపిడిఒ రాధరాణికి వినతిపత్రం అందజేశారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సయ్యద్ జానీ, యూత్ విభాగం నియోజకవర్గం ఉపాధ్యక్షులు మహ్మద్ ఖాజు మాట్లాడుతూ సమస్యను పరిష్కరించని పక్షంలో అందోళన చేస్తామని హెచ్చరించారు.

## బస్టాప్ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని తక్కళ్ళపల్లి తండా వద్ద అర్టీసి అధికారులు బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని తక్కళ్ళపల్లి తండా సర్పంచ్ రమావత్ కౌసల్య, ఉప సర్పంచ్ విస్లావత్ రాజు అర్టీసి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తక్కళ్ళపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామాలైన నక్క గుట్ల తండా, ఎర్రగొల్ల తండాకు చెందిన బస్‌స్టాప్ లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, రాత్రివేళ్ళల్లో బస్సులు ఆపకపోవడంతో భయాందోళనకు గురి అవుతున్నారని తెలిపారు.

## సమతుల్యమైన పశుగ్రాసం అందించాలి



**ప్రజాపక్షం/కేశంపేట:** పశువులకు సమతుల్యమైన ఆహారం అందించేందుకు అన్నదాతలు కృషి చేయాలని హైద్రాబాద్ రీజినల్ పొడర్ స్టేషన్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ అంజిబసేరా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లేమామిడి గ్రామ రైతు వేదికలో రైతులకో యాప్ 29సొప్ప విత్తనాలపై పాడి పశువులు ఉన్న రైతులకు డాక్టర్ అంజిబసేరా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్, ఆర్టిఫిషియల్ బైపు ఏఈ నరేందర్‌రెడ్డి, ఆర్టిఫిషియల్ ఇన్సిమేషన్ టెక్నిషియన్ ఎండి ఫారుక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

## రైతులకు న్యాయం చేస్తాం



**ప్రజాపక్షం/షాబాద్:** రేడియల్ రింగు రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ అన్వర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగరకుంట గ్రామంలో భూములు కోల్పోతున్న రైతులతో జరిగిన సమావేశంలో తహసీల్దార్ అన్వర్ మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ రెవెన్యూ వాల్యువేషన్ ప్రకారం ఎకరాకు రూ. 21లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ ఖాజ, సర్పంచ్ పాలమాకుల మల్లయ్య, డిప్యూటీ సర్పంచ్ బుగ్గరాములు,పంచాయతీ కార్యదర్శి రభీయా సుల్తాన, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## యూరియా యాప్‌కు స్పందన

**రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉష**



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** యూరియా బుకింగ్ యాప్ విజయవంతంగా అమలవుతూ రైతుల నుంచి విశేష స్పందన పొందుతుందని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష తెలిపారు. ఫిబ్రవరి 1నుండి 24 వరకు తక్కువ వ్యవధిలోనే మొత్తం 35,290 మంది రైతులు యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకొని 1,17,345 యూరియా సంచులను లిఫ్ట్ చేసుకున్నారన్నారు.

**యాప్ ద్వారా ప్రయోజనాలు:** ముందస్తు యూరియా బుకింగ్ సౌకర్యం, రియల్ టైమ్ స్టాక్ వివరాల పారదర్శక ఎరువుల దుకాణాల వద్ద క్యూలు తగ్గింపు, క్రమబద్ధమైన, సమర్థవంతమైన పంపిణీ వ్యవస్థ ఎరువుల దుర్వినియోగం అరికట్టడంతో పాటు మళ్లింపుల నివారణ దోహదపడుతుందన్నారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎరువుల డీలర్లు, వాలంటీర్ల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని ఆమె వివరించారు. ఎరువుల సరఫరా వ్యవస్థ మరింత పారదర్శకంగా కొనసాగుతుందని డిఎఒ పేర్కొన్నారు.

## అణచివేతపై ఈశ్వరీబాయి పోరాటం స్ఫూర్తిదాయకం

**మంత్రి వివేక్ వెంకటస్వామి**



**ప్రజాపక్షం/సోమాజిగూడ :** ఒకవైపు తెలంగాణ కోసం ఉద్యమిస్తూనే, మరోవైపు దళితులపై జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా ఈశ్వరీబాయి పోరాటం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి కొనియాడారు. మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈశ్వరిబాయి స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో ఈశ్వరీబాయి 35వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ట్రస్టు చైర్‌పర్సన్, మాజీ మంత్రి జె.గీతారెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరై ప్రసంగించారు. విద్య బలీయమైన శక్తి అని నమ్మిన అంబేద్కర్ ఆలోచనానుసారం దళిత పిల్లలు చదువుకోవాలనే ఈశ్వరీబాయి స్కూల్ స్థాపించారన్నారు. ఈశ్వరీబాయి విలువలు, నిబద్ధతకు కట్టుబడి ఉంటూ తన ఆర్‌పిఐ పార్టీ ద్వారా పేదలకు ఎంతో సేవ చేశారన్నారు. ముందుగా, రిటైర్డ్ ఐఎఎస్ జె.బి.రాజుకు ఈశ్వరీబాయి అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక అధ్యక్షులు ఏనుగు నరసింహారెడ్డి, టి.వి.ఆర్టిస్టు గగనమాలిక్, రిటైర్డ్ ఉన్నతాధికారి పిఎస్ఎన్ మూర్తి, పద్మశ్రీ గ్రహీత రవికుమార్, గాయకులు మాస్టర్ జీ పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల్లో తప్పిదాలకు తవ్వివొద్దు

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి**




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఇంటర్ వార్షిక పరీక్షలలో ఎలాంటి తప్పిదాలకు తవ్వివకుండా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరం నుంచి సంబంధిత ఆర్డీఓలు, ఎంపిడిఓలు, ఆర్.సి.లు, పోలీస్, విద్యుత్, విద్యాశాఖ అధికారులతోపాటు, వివిధ శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి మార్చ్ 18వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు చేపట్టవలసిన పనులను సమన్వయంతో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 200 పరీక్షా కేంద్రాల ద్వారా 84,301 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 70,171 మంది రెండవ సంవత్సరం విద్యార్థులు, జిల్లాలో మొత్తం 1,54,472 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. 31 ప్రశ్న పత్రాల స్టోరేజ్ పాయింట్లు ఉంటాయని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీస్ శాఖ వారు పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించాలని, పరీక్షా పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేసి సిబ్బంది కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా కేంద్రాలలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోస్టల్ శాఖ వారు జవాబు పత్రాలను సరిగా రిసీవ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో అవసరమైన మంచినీరు, ఫాన్స్, టాయిలెట్స్ ఏర్పాట్లు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓలు జగదీశ్వర్‌రెడ్డి, అనంత్ రెడ్డి, సరిత, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంక్యా నాయక్, విద్యాశాఖ అధికారి పి.సుసిందర్‌రావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితా దేవి, పోలీస్, పోస్టల్, ఆర్టీసీ, విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర

**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర ఉంటుందని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం ముచ్చింతల్ గ్రామ పరిధిలో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్వహించిన రంగారెడ్డి జిల్లా సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడంలో సర్పంచ్‌ల పాత్ర ఎంతో ఉంటుందని, ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకువెళ్ళేందుకు చురుకైన పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించుకుంటూ సేవా కార్యక్రమాలను చేయాలని సూచించారు. ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకునేందుకు సర్పంచ్‌లు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుగా గుర్తించి పరిష్కరిస్తే వారికే ప్రజలందరు పట్టం కడుతారనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో నిపుణులు చూపిస్తున్న సూచనలు, సలహాలను పాటిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పంచాయతీ రాజ్ అధికారి సురేష్ మోహన్, డివిజనల్ పంచాయతీ అధికారి సాధన, మండల పంచాయతీ అధికారులు కిష్టయ్యలతోపాటు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

**ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్ డిమాండ్**

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలరని జిల్లా కలెక్టర్‌ను కోరుతూ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా నాయకులు వినతి పత్రం అందజేశారు ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోగలరని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మంచాల రోడ్ లోని పెట్రోల్ బంక్ ను ఆనుకొని శ్రీ చైతన్య పాఠశాలలో తరగతులు బోధిస్తున్నారు. సుమారుగా 1500 మంది విద్యార్థులు ఉన్న ఆ పాఠశాల పెట్రోల్ బంక్ దాటక పాఠశాలలోకి వెళ్లాల్సి వస్తుందని, ఆ సమయంలో ఎటువంటి ప్రమాదం జరిగిన విద్యార్థులకు ప్రాణహాని ఉందని, అదేవిధంగా పాఠశాలకు ఎటువంటి ఫైర్ సేఫ్టీ అనేది లేదన్నారు. విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలను పాటించకుండా వ్యాపారమే ధ్యేయంగా విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై తక్షణం చట్టపరమైన చర్యలు తీసుకోగలని జిల్లా కలెక్టర్‌కు అందజేసినా ఫిర్యాదులో పేర్కొన్నారు.

## గోపన్‌పల్లితండా ఎటిఎం నగదు దొంగ అరెస్టు

**రూ.34.90 లక్షలు స్వాధీనం- నార్సింగి ఎసిపి రమణగౌడ్**




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎటిఎం నగదు రవాణా వాహనం నుంచి నగదు అపహరణ చేసిన కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం నార్సింగి ఎసిపి రమణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 12న గోపన్‌పల్లితండా ప్రాంతంలో ఎటిఎంలకు నగదు సరఫరా చేస్తున్న వాహనం నుండి రూ.56 లక్షల నగదు అపహరించిన ఘటన చోటుచేసుకుందని తెలిపారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు అదే రోజు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. సికింద్రాబాద్ డైమండ్ పాయింట్ నివాసి అయిన నిందితుడు బడిగెరే అజిత్ కుమార్ అలియాస్ శివ(34) సంగెం సెక్యూరిటీ ఏజెన్సీలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా బొమ్మనహల్ స్వస్థలం. ఎటిఎంలో నగదు ఫిల్ చేస్తున్న సమయంలో సహచరులు వాహనం బయట ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకుని అజిత్ కుమార్ వాహనాన్ని నగదుతో సహా తీసుకొని పారిపోయాడు. గద్దర్ చౌరస్తా, నల్లగండ్ల ప్రాంతాలకు వెళ్లి నగదు ఉన్న ట్రంక్ బాక్స్‌ను తీసుకుని వాహనాన్ని అక్కడే వదిలి ఆటోలో పారిపోయాడు. అదే రోజు రాత్రి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ప్రాంతంలోని ఒక లాడ్జ్‌లో సాధారణ ప్రయాణికుడిలా దిగాడు. యాక్స్ బ్లేడ్‌తో నగదు పెట్టెను తెరిచి డబ్బును బ్యాగ్‌లో పెట్టుకుని ఈనెల 13న అనంతపూర్‌కు వెళ్లాడు. అనంతరం బళ్లారి, బెంగళూరు, పుణే ప్రాంతాల్లో తిరుగుతూ పోలీసులను తప్పించుకునే ప్రయత్నం చేశాడు. సాంకేతిక ఆధారాలతో నిందితుడి కదలికలను ట్రాక్ చేసిన పోలీసులు బుధవారం శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. రూ.34,90,000 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేసి పంచనామా నిర్వహించామని ఎసిపి తెలిపారు. మిగిలిన నగదును జల్సాల కోసం వాడుకున్నట్లు నిందితుడు ఒప్పుకున్నాడన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. డ్రైవర్ల నియామకంలో నిర్లక్ష్యం వహించిన సంగం సెక్యూరిటీ ఏజెన్సీపై ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీస్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. నిందితుడి అనుమానాస్పద కదలికలను గమనించి పోలీసులకు సమాచారం అందించిన ఎస్‌విఆర్ బస్ ట్రావెల్స్ డ్రైవర్ ఉమాకాంత్‌ను పోలీసులు అభినందించారు. కేసును శేరిలింగంపల్లి జోన్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో, అదనపు డిసిపిఉదయ్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంలో సమన్వయంతో ఛేదించారు.

## జంట నగరాల్లో 217 ఇంటర్ పరీక్షా కేంద్రాలు

**మొత్తం 1,76,313 మంది విద్యార్థులు**

**పరీక్షల నిర్వహణకు డిఇసి ఏర్పాటు**

**ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు**

**5 నిముషాలు ఆలస్యమైనా అనుమతి**

**హైదరాబాద్ జిల్లా డిఇసి కన్వీనర్ డి.ఒడ్డెన్న**

**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** ఇంటర్ మీడియట్ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జంట నగరాల్లో 217 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రానికి అయిదు నిముషాలు ఆలస్యమైనా అనుమతి ఇస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా పరీక్ష కమిటీ కన్వీనర్ డి.ఒడ్డెన్న తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన చెప్పారు. ప్రభుత్వ జూనియర్, ప్రభుత్వ అనుబంధ జూనియర్ కళాశాలల్లో పని చేసే లెక్చరర్లతో పరీక్షా కేంద్రానికి ఒకరు చొప్పున మొత్తం 217 మంది చీఫ్ సూపరింటెంట్లను ఏర్పాటు చేశారు. ప్రశ్నా పత్రాలను కేంద్రాలకు అందించడానికి, పరీక్షల నిర్వహణలో సహాయసహకారాలు అందించేందుకు 45మంది కస్టోడియన్లను ఏర్పాటుచేశారు. మానసిక ఆందోళనలు గురైన వారి కోసం టెలిమానస్ ఏర్పాటు చేశారు .పరీక్షా కేంద్రాలను 29 సెగ్మెంట్లుగా విభజించి 29 పోలీస్ స్టేషనకు అనుసంధానం చేశారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. సమస్యాత్మక పరీక్షా కేంద్రాలలో ప్రశాంతంగా పరీక్షల నిర్వహణకు సీనియర్ లెక్చరర్లను సిటింగ్ స్క్వాడ్‌లుగా నియమించారు. అన్ని కేంద్రాలలో నిఘా కోసం సిసి కెమెరాలను అమర్చారు. నాంపల్లిలోని ఇంటర్ బోర్డులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కు అనుసంధానం చేశారు. ఇక్కడి నుంచి ప్రతి పరీక్షా కేంద్రాన్ని నిషితంగా పరిశీలించి పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి అవసరమైన సహాయ సహకారాలు, తగిన చర్యలు వెంటనే తీసుకుంటారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకునేలా విద్యార్థులకు ఆర్టీసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. విద్యార్థులు తమ వెంట ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, చేతి గడియారాలు తీసుకురాకూడదు. వాటిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.

**విద్యార్థులకు టెలిమానస్ సేవలు...** విద్యార్థులు ఎలాంటి మానసిక ఆందోళలకు గురికావద్దని, ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఇంటర్ విద్యాశాఖాదికారి, జిల్లా ఎగ్జామినేషన్ కమిటి కన్వీనర్ ఒడ్డెన్న తెలిపారు. మానసిక ఆందోళనలు గురైన వారి కోసం టెలిమానస్ ఏర్పాటు చేశామన్నారు. దీనిని ఉపయోగించుకుని మానసిక ఆందోళనను దూరం చేసుకోవాలని చెప్పారు. ఎలాంటి ఆందోళనలకు దూరంగా ఉంటే పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని చెప్పారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రానికి అరగంట ముందు రావాలని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారు వారి వెంట అవసరమైన మందులు వెంట తెచ్చుకోవాలని చెప్పారు. సమయం తెలుపసుకోవడం కోసం ప్రతి గదిలో గోడ గడియారం ఏర్పాటు చేశామన్నారు.

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం..

# పనుల్లో వేగం పెంచండి

జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి. కర్ణన్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా చేపట్టిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్డిపి), హెచ్ సిటీ, వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్డిపి) ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు, ప్లానింగ్, ఇరిగేషన్, భూసేకరణ అధికారులతో మంగళవారం ఆయన కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ జోన్‌లలో జరుగుతున్న పనుల పురోగతిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అధికారులు కమిషనర్‌కు వివరించారు. ముసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జి, నల్లగొండ ఎక్స్ రోడ్డు ఫ్లై ఓవర్ పనులను మిషన్ మోడ్‌లో చేపట్టి, జూన్ 2వ తేదీ కల్లా అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టుల పూర్తికి నిధుల సమస్య లేదని, పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. 'నగర ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పించడమే లక్ష్యంగా ఇంజనీరింగ్ అధికారులు పని చేయాలి. పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లక్ష్యాలను చేరుకోవాలి' అని ఆర్.వి. కర్ణన్ అన్నారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, జి. ముకుందా రెడ్డి, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, ప్రత్యేక ఉప కలెక్టర్ రమాదేవి, ఇతర ఎస్ఇలు, ఇఇలు పాల్గొన్నారు.

**క్యూఆర్ కోడ్ ఆధారిత చెత్త సేకరణతో జవాబుదారీతనం**

నగరంలో పారిశుద్ధ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా జిహెచ్ఎంసి కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా చేపట్టిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఇంటింటి నుంచి చెత్త సేకరణ విధానం ద్వారా జవాబుదారీతనం పెరుగుతుందని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. రాజేంద్రనగర్ జోన్, అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్‌గూడ నలందనగర్‌లో కొనసాగుతున్న పైలట్ ప్రాజెక్టును మంగళవారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో స్వచ్ఛ ఆటో కార్మికులది క్రియాశీలక పాత్ర అని ఆయన అభినందించారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు, పనితీరులో గానీ, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో కాని ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని కమిషనర్ హెచ్చరించారు. స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇవ్వని గృహాలను గుర్తించి, వారిని మోటివేట్ చేయాలని అధికారుల కు సూచించారు. 'ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించాలి.

ఈ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు విజయవంతమైతే, త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేస్తాం' అని కమిషనర్ కర్ణన్ అన్నారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం) ఎన్. రవికిరణ్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలోకి సుధాకర్

**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని బీరోల్ గ్రామ సర్పంచ్, స్వతంత్ర సర్పంచ్ సుధాకర్, మాజీ సర్పంచ్ సంగారెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సింగ్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలని ఆశయంతో అధికారపార్టీలో చేరడం జరిగిందన్నారు. స్పీకర్ సహాయంతో గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుంన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల పట్ల హైకోర్టు తీర్పు చరిత్రాత్మకం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల పట్ల సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రకమని తెలంగాణ ఉర్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా కన్వీనర్ దొమ్మటి కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హమీల ప్రకారం ఇళ్ల స్థలాలు, పెన్షన్లు మంజూరు చేయాలని కోరుతూ పలువురు దాఖలు చేసిన పిటిషన్ కేసుకు సంబంధించిన విచారణలో న్యాయవాది కరుణాకర్‌రెడ్డి తన వాదనలు బలంగా వినిపించడం పట్ల దొమ్మాటి కిరణ్‌కుమార్ హైకోర్టు, సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పిసిసి అధ్యక్షులు మహేస్‌కుమార్‌గౌడ్, జెఎసి అధ్యక్షులు కోదండరాంరెడ్డి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.




## మెడికల్ కార్డు రెన్యూవల్ శిబిరాలు ఏర్పాటు చేయాలి : వేణు మాధవ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు దాదాపు రెండు వేల మంది సిపిఆర్ఎంఎస్ కార్డులు రెన్యువల్ చేసుకోలేదని తెలుస్తుందని సింగరేణి యాజమాన్యాలు తమ పరిధిలోని ఆస్పత్రులందు లేదా జనరల్ మేనేజర్ కార్యాలయంలలో మెడికల్ కార్డు రెన్యూవల్ కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాధవ్ మాట్లాడుతూ విశ్రాతి ఉద్యోగులకు ఎటువంటి అవాంతరాలు లేకుండా నిరంతరం వైద్య సేవలు అందించాలని అన్నారు. సింగరేణి విశ్రాంతి ఉద్యోగులకు కార్పొరేట్ హాస్పిటల్ వైద్య సౌకర్యం కొరకు యాజమాన్యం సిపిఆర్ఎంఎస్(కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్డ్ మెడికేర్ స్కీం)2018 సంవత్సరం నుంచి అమలు చేస్తున్నారని ఈ పథకంలో చేరిన వారి దగ్గర 40వేల రూపాయలు వసూల్ చేసి జీవితాంతం రిటైర్ ఉద్యోగికి అతని జీవిత భాగ్యస్వామికి 8లక్షల విలువగల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజనర్సు, చుక్కల నర్సయ్య, సర్జిత్ సింగ్, టి రాజనర్సు, బంగారి మల్లయ్య పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ కేంద్రం సందర్శించిన హైమారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గ్రేటర్ హైద్రాబాద్ కార్పోరేషన్ పరిధిలోని శామీర్‌పేట డివిజన్ ఉప్పర్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మహిళా శక్తి మై వాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్. హైమారెడ్డి మంగళవారం సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలోనే ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం అత్యుత్తమ కేంద్రంగా తీర్చిదిద్దుతున్న అంగన్‌వాడీ టీచర్ శ్రీలతను అభినందించారు. చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం వసతులపై టీచర్ శ్రీలతను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో చిన్నారులకు ఏదైన సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్‌లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మహిళా శక్తి మై వాయిస్ ట్రెజరర్ అంబటి రమేష్, మత్స్యకారుల సంఘం డైరక్టర్ రాము, అంజనేయులు, శ్రీశైలం, చిన్నారులు పాల్గొన్నారు.

## కన్నబిడ్డను కడతేర్చిన కసాయి తల్లి



**ప్రజాపక్షం/దుండిగల్:** కన్నబిడ్డను కడతేర్చిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎసిపి శంకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం దుండిగల్ ఔటర్ రింగ్‌రోడ్‌లోని సనరెల్లి నిర్మాణ సంస్థలో రోజువారీ కూలీగా పనిచేస్తున్న మమత తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే నివాసం ఉంటూ రోజువారీ కూలీగా పనులుచేస్తూ జీవనం గడుపు తోంది. వీరిది నవ్వగవ గ్రామం, బీన స్టేషన్ సాగర్ జిల్లా మధ్యప్రదేశ్ మమతా వారి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. తేదీ 24.02.2026న తన కుమారుడు, భార్య ఇంట్లో ఉండగా తన పని నిమి త్తం బయటకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం వచ్చి చూసేసరికి తన కుమారుడిని తన భార్య కాల్చడం చూసి తన భార్యను పక్కకు నెట్టి చూడగ, తన కొడుకు అప్పటికే చనిపోయి ఉన్నాడని, రెండు నెలల బాబు ప్రతిరోజు ఏడుస్తూ ఇబ్బంది పెడుతూ ఉండడంతో కుమారుడిని ఎలాగైనా తప్పించాలనే ఉద్దేశంతో మమత రెండు నెలల బాబుని తన ఇంట్లోనే కాల్చి చంపడం జరిగిందని ఇంకా విచారిస్తున్నామని పూర్తి ఆధారాలతో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సిఐ సతీష్, ఎస్ఐ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## చెత్త సేకరణను బలోపేతం చేయాలి

### మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎక్కడా లోపాలు లేకుండా వంద శాతం చెత్త సేకరణ జరగాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి స్పష్టం చేశారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలో మంగళవారం కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటి చెత్త సేకరణ విధానం, స్వచ్ఛ ఆటో వాహనాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ఎ.శైలజ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం) జాహ్నవి శశాంక్‌లతో కమిషనర్ సమగ్రంగా చర్చించారు. ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా స్వచ్ఛ ఆటోలకు మాత్రమే అప్పగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. బోడుప్పల్ సర్కిల్‌లో పరిశుభ్రత మెరుగుదలకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో ఎఇ (ఎస్‌డబ్ల్యూఎం) మహేష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## అమీన్‌పూర్ చెరువును ఆహ్లాదకరంగా మారుస్తాం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమీన్‌పూర్ చెరువును ఆహ్లాదకరంగా మార్చేందుకు సుందరీకరించేందుకు చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన అన్నారు. అమీన్‌పూర్ సర్కిల్‌లో సోమవారం క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించారు. చెరువు పరిరక్షణ, పారిశుద్ధ్య మెరుగుదల, సుస్థి ర అభివృద్ధి లక్ష్యంగా పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. అమీన్‌పూర్ చెరువును సందర్శించిన కమిషనర్, చెరువులో విస్తరించిన గుర్రపు డెక్కను తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. చెరువు కట్ట వెంట వినోదం, ప్రజా ఉపయోగ సదుపాయాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ సూచించారు. అమీన్‌పూర్ పరిసర ప్రాంతంలో ఉన్న తాత్కాలిక చెత్త డంప్ యార్డ్‌ను తక్షణమే తొలగించాలని పారిశుద్ధ్య విభాగం అధికారులను ఆదేశించారు. కూరగాయల వ్యాపారులతో మాట్లాడిన కమిషనర్, ప్రతి వ్యాపారి తమ వద్దే చెత్త సంచులు ఏర్పాటు చేసి వ్యర్థాలను వేరుగా సేకరించాలని సూచించారు. అమీన్‌పూర్ సర్కిల్ లో సుస్థిర అభివృద్ధికి ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు.

## సుస్థిర వ్యవసాయం – సాగు పద్ధతులపై రైతులకు శిక్షణ

### వ్యవసాయాధికారి(ఎడిఎ) వెంకట్రామ్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్‌పై మూడుచింతలపల్లి మున్సిపాలిటి ఉద్దెమర్రిలో రైతులకు సుస్థిర వ్యవసాయ సాగు పద్ధతులపై విస్తృత శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయాధికారి వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్)లో భాగంగా సహజ వ్యవసాయం ప్రాముఖ్యత, ప్రయోజనాలపై రైతులకు వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగాన్ని తగ్గించి సహజ వనరులను ఉపయోగించి వ్యవసాయం చేయడం వలన నేల ఆరోగ్యం మెరుగుపడుతుండటంతో పాటు రైతుల ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. జీవామృతం, ఘనామృతం, బీజామృతం వంటి సహజ పద్ధతులను ఉపయోగించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. అదే విధంగా పంటల వైవిధ్యాన్ని పెంపొందించడం, అంతర పంటలు, మిశ్రమ పంటలు సాగు ద్వార ఆదాయం పెంచుకోవచ్చని నిపుణులు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ప్రవీణ, శాస్త్రవేత్త శ్రీకృష్ణ, ఎఇఒ సురేష్, మాజీ సర్పంచ్ దోసకాయల వెంకటేష్, బండి జగన్నాథం, రైతు సంఘం నాయకులు సంగిశెట్టి ఆంజనేయులు, నెల్లుట్ల ఆంజనేయులు, సుధాకర్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనులు

### అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.6.12కోట్ల నిధులు

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు నియోజకవర్గం సమాగ్రాభివృద్ధే లక్ష్యంగా సిఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులతో పనిచేయడం జరుగుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. తాండూరు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.6.12కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. నూతనంగా మంజూరైన ఈ పనులను నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ తక్షణమే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

గ్రామాల్లో రహదారి సదుపాయాలు మెరుగుపడటంతో ప్రజల కు రవాణా సౌకర్యం మరింత సులభతరం అవుతుందన్నారు. అదే విధంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటివరకు మంజూరైన రూ.14.20కోట్ల వ్యయంతో గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడి భవనాలు, మహిళా సమాఖ్య భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రహరీ గోడల నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పనులు త్వరలోనే పూరి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరానున్నట్లు తెలిపారు.

అదే విధంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు దాదాపు రూ.20.3కోట్లు మంజూరైనట్లు, మరో రూ.1.50కోట్ల నిధులు తర్వలోనే విడుదల కానున్నాయని తెలిపారు. తాండూరు నియోజకవర్గ సమాగ్రాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవత్‌రెడ్డి ఆశీస్సులతో పనిచేయడం జరుగుతుందని తెలిపారు.

## పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

### కలెక్టర్ ప్రతీక్‌జైన్




**ప్రజాపక్షం/వికారాబాద్:** ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఇంటర్, టెన్త్ పరీక్షల నిర్వహణకోసం చేపట్టిన ఏర్పాట్లను సిఎస్ దృష్టికి తెచ్చారు. ఈ నెల 25నుండి మార్చి 18వ తేది వరకు కొనసాగనున్న ఇంటర్మీయట్ వార్షిక పరీక్షలకు మొత్తం 16,400మంది విద్యార్థులు హాజరు కానున్నారని, 28 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. మార్చి14నుండి ఏప్రిల్ 16వ తేదీ వరకు జరిగే పదవ తరగతి 144 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా చేయాలని తెలిపారు. నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించామని అన్నారు.

ప్రశ్నాపత్రాలను ఆయా రూట్ల వారీగా పోలీస్ ఎస్కార్ట్ మధ్య తీసుకెళ్లాలని సూచించామని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద నిషేదాజ్ఞలు అమలుచేస్తు తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తామని పరీక్షలు జరిగే సమయంలో పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసి ఉంచాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులతో కలిసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి శంకర్ నాయక్, డిఇఒ రేణుకాదేవి డిపిఒ జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

## కారు ప్రమాదం ప్రమాదంలో ఒకరు మృతి

**ప్రజాపక్షం/పరిగి:** రంగాపూర్ గేట్ సమీపంలో కారు ఢీ కొని ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిగి మండలంలోని రంగాపూర్ గేట్ సమీపంలో ఘెర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగం గా దూసుకొచ్చిన ఇన్నోవా కారు ముందు వెళ్తున్న రెండు బైకులను వరుసగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో మాదారం గ్రామానికి చెందిన కామిని నర్సింలు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరోఇద్దరికి తీవ్ర గాయాలయినాయి. వీరిని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ తప్పించుకునే ప్రయత్నం చేయగా స్థానికులు పోలీసులకు అప్పగించారు. మృతుని పోస్టుమార్టం నిమి త్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ఇఫ్తార్ విందులో స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్ష/మర్పల్లి:** రంజాన్ ఉపవాస దీక్షల విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్న స్పీకర్ ముందుగా ప్రార్థనలలో పాల్గొని అనంతరం ముస్లిం సోదరులకు ఖర్జురం తినిపించి ఈ రోజు ఉపవాస దీక్షను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సురేష్‌యాదవ్, సర్పంచు రామేశ్వర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ కొండల్‌రెడ్డి, ముస్లిం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అంటేనే పేదవాడి ప్రభుత్వం

### టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**ప్రజాపక్షం/పూడూర్ :** పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండల పరిధిలోని మీర్జాపూర్ గ్రామంలో మంగళవారం టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే పేదవాడి ప్రభుత్వం అని పేర్కొన్నారు. పేదలకు అండగా నిలుస్తూ పింఛన్ల వ్యవస్థను కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రారంభించిందని గుర్తు చేశారు. పేదవాడికి తినడానికి తిండి ఉండాలని అందుకే ఉపాధిహామీ పథకాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ,ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కూలీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మీర్జాపూర్ గ్రామంలో పర్యటించి కొనసాగుతున్న ఇందిర్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులకు లబ్దిదారులను అడిగి తెలుసుకుని నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులందరికీ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## సొంత ఇంటి కలను నెరవేర్చేందుకే ఇందిరమ్మ ఇండ్ల పథకం

### బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఇల్లు లేని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చాలన్న ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని చేపట్టి అమలు చేయడం జరుగుతుందని మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ అన్నారు. మున్సిపల్ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన ఘట్‌కేసర్ సర్కిల్ 6,7 డివిజన్ లో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్, హౌసింగ్ బోర్డు ఎఇ కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వేముల మహేష్ గౌడ్, ముల్లి పావనిజంగయ్య యాదవ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో మగ్గుతూ సొంతింటి కోసం ఆశగా ఎదురుచూస్తున్న నిరుపేదల కళ్లలో ఈరోజు నిజమైన సంతోషం వెల్లివిరిసింది. అర్హతే గీటురాయిగా పారదర్శకంగా నిజమైన పేదలకు ఇళ్లు అందిస్తూ కాంగ్రెస్‌పార్టీ పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు సంజీవ రెడ్డి, మైనార్టీ అధ్యక్షులు ఫరూక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ కడుపోల్ల మల్లేష్, ఉల్లి ఆంజనేయులు యాదవ్, మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

**ప్రజాపక్ష/మోమిన్‌పేట్:** అంబేద్కర్ విగ్రహం ధ్వసంచేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. మోమిన్‌పేట్ మండల అమ్రదికలాన్ గ్రామంలో గత శనివారం అర్ధరాత్రి అంబేద్కర్ విగ్రహంపై కొందరు దుండగులు దాడిచేసి ధ్వంసం చేసిన ఘనట విదితమే. మూడు రోజులు గడుస్తున్నా ఇంకా నిందితులను గుర్తించడంలో పోలీసులు వహిస్తున్న నిర్లక్ష్యం పై నిరసన వ్యక్తం చేసిన ప్రజాసంఘాల నాయకులు మండల కేంద్రలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మల్లేశం, శ్రీనివాస్, నర్సింలు, ఎవాన్, ఆనంద్, అమోష్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా కోసం రైతులు ఎదురుచూపు

**ప్రజాపక్షం/పరిగి :** రైతు భరోసా కోసం ఎదురుచుస్తున రైతుల అని బిఆర్ఎస్ పార్టీ యువనాయకులు విక్కీనాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసిన రాష్టంలో జమకాని రైతుబంధు నగదు ,మున్సిపల్ కోడ్ ముగిసిన వెంటనే రైతుబంధు రైతుఖాతాలో జమవేయడం జరుగుతుందని, రాష్ట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికలు ముగిసినరైతుబంధు పడలేదని, రాష్టప్రభుత్వంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం నుండి ఎలాంటి క్లారిటీ లేదని ప్రభుత్వం రైతుభరోసా పట్ల డిలే చేయడం ఏమిటని ప్రశ్నించారు. యాసంగి సీజన్ అందుతుందన్నా భవించిన రైతులకునిరాశ ఎదురయిందని అన్నారు. రైతులు అధిక వడ్డితో ప్రవేట్ అప్పులు తీసుకొని సాగు కొనసాగిస్తున్న పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

